www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 13 డిసెంబర్ 2025

వైఎన్‌లో క్రీడా సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని వైఎన్ కళాశాలలో శుక్రవారం ఉద్యోగులకు డివిజన్ స్థాయి గోదావరి క్రీడా సంబరాలు ప్రారంభించారు. ఈ పోటీలకు ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల నుంచి ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డిపార్ట్మెంట్ విభాగాలుగా పురుషులు, మహిళల టీమ్‌లను ఎంపిక చేశారు. పురుషులకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, మహిళలకు క్యారమ్స్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, త్రోబాల్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి శ్రీవేద ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఉద్యోగుల పనిభారం తగ్గించేందుకు ప్రభుత్వం ఇటువంటి క్రీడలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని..

కదంతొక్కిన అంగన్‌వాడీలు

నినాదాలతో హోరెత్తిన భీమవరం కలెక్టరేట్

వేతనాలు పెంచకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరిక

డిఆర్‌ఒ, ఐసిడిఎస్ పీడీలకు వినతులు అందజేత

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొంటా

పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

కలెక్టరేట్ వద్ద బైఠాయించిన నినదిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - భీమవరం

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు కదం తొక్కారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలొచ్చిన అంగన్వాడీలు ప్రభుత్వం తీరుపై నిరసనాగ్రహం తెలిపారు. సమ్మెకాల ఒప్పందాలతోపాటు కూటమిగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలు పెంచడంతోపాటు సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమ్మెకాల ఒప్పందాలు అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అంగన్వాడీలు తరలొచ్చారు. నేలపై బైఠాయించి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా నినదించారు. ధర్నాకు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఏడేళ్లుగా అంగన్వాడీలు కనీస వేతనాలు అమలు చేయాలని ఆందోళన చేస్తుంటే వేతనం పెంచకుండా అది చేశాం, ఇది చేశామని పాలకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అన్ని రకాల సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, వీటిని తట్టుకోవాలంటే వేతనాలు పెంచకుండా ఎన్ని మాటలు చెప్పినా పొట్ట నిండదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలైనా అంగన్వాడీలకు వేతన పెంపు అమలు చేయకపోవడం దారుణమని విమర్శించారు. ప్రీ స్కూలు పిల్లలు లేకపోవడం అంగన్వాడీల తప్పిదంగా పాలకులు చెప్పడం అన్యాయమన్నారు. స్త్రీ, శిశుసంక్షేమానికి ప్రభుత్వం నిధుల కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యో[illegible] లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీల్లో అత్యధికంగా పేద మహిళలు ఉన్నారని, వారికి ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, తల్లికి వందనం వంటి పథకాలను అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో అంగన్వాడీలు చేపట్టే ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు, కోశాధికారి పివి.ప్రతాప్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. తక్షణమే కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్వాడీలను అశ్రద్ధ చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి 18 నెలలు గడుస్తున్నా అదే నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. ఈ నిర్లక్ష్యమే మరో ఉద్యమానికి దారితీస్తుందన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడుతూ తక్షణం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఒ శివన్నారాయణరెడ్డి, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి అంగన్వాడీల ధర్నా ప్రాంతానికి విచ్చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీలు, సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నేతలు సమస్యలు వారికి వివరించి వినతపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన వారు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యు.పాండురంగావు, సుకుమార్ అంగన్వాడీల ఆందోళనకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, యూనియన్ నాయకురాలు ఎమ్‌డి.హసీనా, ఉషారాణి, తులసి, మహాలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ పీడీకి వినతి అందిస్తున్న నేతలు, అంగన్వాడీలు

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

రక్తం కొరతతో ప్రాణాలు కోల్పోకూడదు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

రక్తం కొరత కారణంగా ప్రాణాపాయ స్థితి, అనారోగ్యంతో ఏఒక్కరూ ప్రాణం కోల్పోకూడదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్లో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగుల రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అందరిలో స్ఫూర్తిని నింపడానికి స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రక్తం కొరతను నివారించేందుకు ప్రతి నెలా ఒకటో, మూడో శుక్రవారాలు వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది రక్తదాన శిబిరాల్లో పాల్గొని రక్తాన్ని అందజేస్తున్నారన్నారు. డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిఎంహెచ్‌ఒ జి.గీతాబాయి, డిఇఒ ఇ.నారాయణ, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంఎస్‌వి.శివరామభద్రిరాజు, రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ వబిలిశెట్టి కనకరాజు, సభ్యులు కృష్ణారావు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం

69వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక అండర్-17 బాల బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం స్థానిక ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు సాగే ఈ పోటీలను భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. తొలుత 13 జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించి, క్రీడాజ్యోతి వెలిగించారు. అనంతరం సాఫ్ట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలనూ ఒక అంశంగా విద్యార్థులు చేర్చుకోవాలన్నారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ప్రతి విద్యార్థీ వ్యాయామానికి ప్రాధన్యత ఇవ్వాలన్నారు. ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా చదవులో మరింత పోటీతత్వం అలవడి విద్యలో మరింత రాణిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్, సర్పంచి చికిలే మంగతాయారు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, ఎంపిటిసిలు గుళ్లిపల్లి విజయలక్ష్మి, యాళ్లబండి ఇందిర, దాతలు గుద్దటి స్వామీజీ, మద్దాల తాతారావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు డి.సునీత, పిఎస్‌ఎన్.మల్లేశ్వరరావు, వీరవల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పి-4లో హైస్కూల్ ప్రహరీ నిర్మాణం

172 సంవత్సరాల చరిత్ర గల వీరవాసరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ నిర్మాణానికి ఎంఎల్‌ఎ సహకరిస్తే పి-4 ద్వారా దాతల సహకారంతో ఏర్పాటు చేస్తామని పూర్వపు విద్యార్థుల అసోసియేషన్ నాయకులు బాజింకి కృష్ణారావు తెలిపారు. దీనికి ఎంఎల్‌ఎ సానుకూలంగా స్పందించారు. దాతలు ముందుకొస్తే గ్రామస్తుల సహకారంతో ప్రహరీ నిర్మాణానికి అన్ని విధాలుగా సహకరిస్తామని ఎంఎల్‌ఎ అంజిబాబు హామీ ఇచ్చారు. హైస్కూల్ క్రీడా మైదానం ఆక్రమణలు తొలగిస్తామని ఆయన తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు.

మహతిని అభినందిస్తున్న దృశ్యం

బాస్కెట్ బాల్ టీమ్ కెప్టెన్‌గా మహతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ పూర్వ విద్యార్థిని రేలంగి మహతి ఆంధ్రా యూనివర్సిటీ బాస్కెట్ బాల్‌టీంకు కెప్టెన్‌గా ఎంపికైంది. ఈ సందర్భంగా జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మద్దాల వాసు మాట్లాడుతూ పశ్చిమగోదావరిలో మొట్టమొదట అమ్మాయి ఆంధ్రా యూనివర్సిటీ బాస్కెట్ బాల్ టీంకు కెప్టెన్‌గా వ్యవహరిస్తోంద్నన్నారు. పది నేషనల్ పోటీల్లో ఆడిన క్రీడాకారిణి మహతి అని కొనియాడారు. ఏదైనా సాదించాలనే కోరిక ఉండాలని, ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, దాన్ని పిల్లల తల్లిదండ్రులు గుర్తించి ఆ లక్ష్యం వైపు అడుగులు వేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మహతి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు కోకోనట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కటారి నాగేంద్ర, బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రేలంగి రామకృష్ణ, సెక్రటరీ కె.కృష్ణారెడ్డి, ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ ప్రిన్సిపల్ వసంత లక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ ఉష పాల్గొన్నారు

తిరుపతిలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభకు హాజరైన ఆ సంఘం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధులు

భీమవరం బాలోత్సవం భళా

అట్టహాసంగా మూడో పిల్లల సంబరాలు ప్రారంభం

చిన్నారుల కేరింతలు.. విద్యార్థుల ఉత్సాహంతో సందడిగా ఎస్ఆర్‌కెఆర్ ప్రాంగణం

తరలొచ్చిన సుమారు 4 వేల మంది

బాలోత్సవాల నిర్వహణా కమిటీపై ప్రశంసల వర్షం

ప్రజాశక్తి - భీమవరం

ఒకవైపు చిన్నారుల కేరింతలు.. మరోవైపు ఏదో సాధించాలనే విద్యార్థుల ఆలోచన.. అందరిలో నా బిడ్డ విజేతగా నిలవాలనే తల్లిదండ్రుల తపన.. అతిధులను, ఆహ్వానితులను ఆకట్టుకునే రీతిలో నృత్య ప్రదర్శనలు.. జానపద గేయాల ఆలాపన.. విచిత్ర వేషధారణలు.. ఏకపాత్రాభినయాలు.. ఆహుతులను ఉర్రూతలూగించేలా భీమవరం బాలోత్సవాల మూడో పిల్లల సంబరాలు స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. భీమవరం పట్టణం, మండలం, వీరవాసరం, పాలకోడేరు, ఉండి, కాళ్ల, ఆకివీడు మండలాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాల్లోని 590 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ బాలోత్సవానికి విచ్చేశారు. తరగతి గదుల్లో 15 అకడమిక్, నాలుగు వేదికలపై 18 కల్చరల్ అంశాల్లో విద్యార్థులు ఏకకాలంలో ప్రదర్శనలు ఇచ్చారు. సుమారు నాలుగు వేల మంది విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తరలొచ్చారు. వీరందరికీ అల్పాహారం, భోజనాలు, స్నాక్స్ నిర్వహణా కమిటీ ఏర్పాటు చేసింది. అయితే బాలోత్సవాలు ఏర్పాటుకు నిర్వహణ కమిటీ అలుపెరగని కషి చేసింది. గత మూడు నెలల నుంచి ఏర్పాట్లపై సమావేశాలు సమాలోచనలతో ముందుకు సాగారు. భీమవరం బాలోత్సవం అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య, ఉపాధ్యక్షులు గాతల జేమ్స్, కోశాధికారి పాకలపాటి సీతారామరాజు, అకడమిక్ కన్వీనర్ పి.శ్రీనివాసరాజు, కల్చరల్ కన్వీనర్ బి.చైతన్య ప్రసాద్, కార్యదర్శి రఫయేలు, కె.అశోక్‌తోపాటు మరికొంతమంది సభ్యులు బాలోత్సవ నిర్వహణలో శ్రమించారు.

ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు

వివిధ పోటీలు.. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు

బాలోత్సవాల్లో మొదటిరోజు పోటీలు వివిధ విభాగాల్లో నిర్వహించారు. విజేతలతోపాటు పాల్గొన్న ప్రతిఒక్కరికీ ప్రశంసాపత్రం, బహుమతులు, మెడల్స్ అందజేశారు. శాస్త్రీయ నత్యం (బృందం, సోలో), చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ (సోలో), ఏకపాత్రాభినయం, జానపద నృత్యం (బృందం, సోలో), జానపద గీతాలాపన (సోలో/బృందం) చిత్రలేఖనం, కార్టూన్ గీయడం, మెమరీ టెస్ట్, జనరల్ నాలెడ్జ్ క్విజ్, పద్యం భావం, రైమ్స్, వ్యాసరచన తెలుగు, ఇంగ్లీషు, కథలు చెప్పడం, కవితా రచన, క్లే-తో బొమ్మలు, బెస్ట్ ఫ్రం వేస్ట్ పోటీలు నిర్వహించారు. ప్రతి పోటీలో విజేతలుగా నిలిచిన ఐదుగురు చొప్పున సుమారు 500 మందికి మెమెంటోలు, మెడల్స్ అందజేశారు.

విద్యార్థుల అభినయానికి ముగ్ధులైన తల్లిదండ్రులు

పిల్లల సంబరాల్లో చిన్నారులు, విద్యార్థులు ప్రదర్శించిన అభినయానికి తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానికులు ముగ్ధులయ్యారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నటన, సృజనాత్మకత, ప్రతిభాపాటవాలు చూసి సంభ్రామశ్చర్యాల్లో మునిగి తేలారు. సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థులు ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఫ్యాన్సీ డ్రెస్సుల్లో చిన్నారులు అదరగొట్టారు. విచిత్ర వేషాధారణలతో కడుపుబ్బా నవ్వించారు. ఏకపాత్రాభినయంతో ఔరా అనిపించారు. చిత్రలేఖనం, కార్టూన్‌లు గీయడంలో ప్రతిభ ప్రదర్శించారు. పద్యాన్ని చెప్పి భావం వ్యక్తపరిచిన తీరు చూస్తున్న వారి మనోభావాలను తాకింది. తెలుగు, ఇంగ్లీషులో రాసిన వ్యాసరచనలు, కవిత రచనలు అబ్బురపర్చాయి. బాలల్లో ప్రతిభాపాటవాలు, శక్తియుక్తులు పెరుగుతున్నప్పటికీ వాటిని ప్రదర్శించే వేదిక లేకపోవడంతో, ఆ లోటును భీమవరం బాలోత్సవం తీర్చిందనే వ్యాఖ్యానాలు విన్పించాయి. దేశ భవిష్యత్తుతరానికి పునాదులుగా ఉన్న బాలలను మరింత సాన పడితే వజ్రాయుధాల్లా తయారవుతారనే భావన అందరిలో కనిపించింది. అయితే విద్యారంగంలో ప్రభుత్వం తీసుకొస్తున్న పెనుమార్పులు విద్యార్థులకు ఆటవిడుపుగా ఉన్న క్రీడలు, మానసికోల్లాసానికి ఉపయోగపడే అనేక అంశాలను దూరం చేస్తున్న పరిస్థితి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో భీమవరం బాలోత్సవాలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, ప్రతిభ పాటవాలను వెలికి తీస్తుందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బాలల్లో మేధాశక్తి, ఆత్మవిశ్వాసం పెంపునకు

బాలోత్సవం దోహదం

భీమవరం బాలోత్సవ ప్రారంభ సభలో కలెక్టర్ నాగరాణి

సంప్రదాయాలు, దేశభక్తి, సృజనాత్మకతను పెంచుతుంది

ఎంఎల్‌సి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బాలోత్సవం వంటి కార్యక్రమాల వల్ల బాలల్లో మేధాశక్తి, ఆత్మవిశ్వాసం, సామాజిక అంశాలపై అవగాహన పెరుగుతుందని, విద్యార్థి దశలోనే బాలల మంచి నడవడికకు ఈ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి, పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో భీమవరం బాలోత్సవం (3వ పిల్లల సంబరాలు) ప్రారంభోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా బాలోత్సవ కమిటీ ఛైర్మన్ ఇందుకూరి ప్రసాద్‌రాజు అధ్యక్షులుగా నిర్వహించిన సభలో తొలుత కలెక్టర్ నాగరాణి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు పిల్లలకు ఆటవిడుపుగా ఉంటాయన్నారు. దీంతో వారిలోని మేధాశక్తి పెరుగుతుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల వల్ల సామాజిక అంశాలపై అవగాహన, దేశభక్తి పెరుగుతుందన్నారు. ఇంత పెద్దఎత్తున హాజరైన బాలలను చూస్తే తనకు సంతోషంగా ఉన్నారు. సాంస్కృతిక పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి ముందుగానే శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. అలాగే ఓడినవారు గెలిచేందుకు ప్రయత్నం చేయాలని ఆమె సూచించారు. ఇంత మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న బాలోత్సవ కమిటీకి ఆమె అభినందనలు తెలిపారు. ఎంఎల్‌సి బి.గోపీమూర్తి మాట్లాడుతూ నేడు సమాజంలో కుటుంబ వ్యవస్థలు నాశనమయ్యాయని, ప్రస్తుతం చిన్న కుటుంబాలు ఉన్నప్పటికీ సెల్‌ఫోన్ మాయాజాలంతో ఒకే ఇంట్లో భార్య, భర్త, కొడుకు ఉన్నప్పటికీ గంటలు గంటలు సెల్‌ఫోన్‌లో సోషల్ మీడియాలో మునిగి తేలుతున్నారన్నారు. ఇటువంటి సమయంలో బాలలకు బాలోత్సవం ఎంతగానో ఉపయోగపడుతున్నారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసానికి, ప్రతిభకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కొంతమంది మనుషుల మధ్య వైషమ్యాలు సృష్టించి విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, నాటి రోజుల్లో కొంతమంది పెద్దల్లో మాత్రం ఉండేదని, అది ప్రస్తుతం బాలల వరకు వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి వాటికి ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు స్వామి జ్ఞానానంద, డాక్టర్ ఎంఆర్.రాజు, యల్లాప్రగడ సుబ్బారావు, కవి సాహితీవేత్త అడవి బాపిరాజులపై ఏకపాత్రాభినయం చేసిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. బాలోత్సవం లోగోను ఆమె ఆవిష్కరించారు. వివిధ వేషధారణల్లో ప్రదర్శనలకు సిద్ధంగా ఉన్న చిన్నారుల దగ్గరికి వెళ్లి వారిని ప్రత్యేకంగా అభినందించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామాజిక కార్యకర్తలు, దేశ నాయకులు, శాస్త్రవేత్తలు వంటి పోస్టర్లు ఆకట్టుకున్నాయి. ఈ బాలోత్సవానికి భీమవరం పట్టణం, పరిసర ఆరు మండలాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు సుమారు మూడు వేల మందికిపైగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి నిశాంత్‌వర్మ, కళాశాల డైరెక్టర్ సాయిరామకృష్ణంరాజు, డైరెక్టర్ జగపతిరాజు, ప్రిన్సిపల్ మురళీకృష్ణంరాజు, సిఇఒ దిలీప్ చక్రవర్తితోపాటు బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య, కోశాధికారి పి.సీతారామరాజు, అసోసియేట్ అధ్యక్షులు గాతల జేమ్స్, పి.శ్రీనివాసరాజు, బి.చైతన్యప్రసాద్, కె.అశోక్‌రాజు, కలిగొట్ల గోపాలశర్మ, చాంద్‌భాషా, ఎస్ఎస్ఎన్.రాజు, సిహెచ్.ఝాన్సీ, దాయన చంద్రాజీ, కంతేటి వెంకట్రాజు, గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

మాట్లాడుతున్న గోపీమూర్తి

చిన్నారులతో కలెక్టర్

మానవ అక్రమ రవాణాపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా ఉందని, ప్రతి రోజూ ఎంతో మంది టీనేజ్ అమ్మాయిలు, మహిళలు దీనికి గురవుతున్నారని, దీన్ని నిరోధించే బాధ్యతను అందరూ తీసుకోవాలని ఎంపిడిఒ ఎన్ఎన్‌జె.కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ మీటింగ్ హాల్లో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ (హైదరాబాద్) ఆధ్వర్యంలో జరిగిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాలంటూ మహిళలను మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని అన్నారు. ఇప్పటి వరకూ 29,200 మంది అమ్మాయిలు, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజ్వల కోఆర్డినేటర్ సురేష్ కుమార్, ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ చెన్నకేశవులు మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తుల నుండి మెసేజ్ గానీ కాల్స్ గానీ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కూర్మ వెంకట రెడ్డి, పంచాయతీ రాజ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీచ్‌లో మరుగుదొడ్ల నిర్మాణం చట్ట విరుద్ధం

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం సౌత్ కనకదుర్గ బీచ్‌లో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం చట్ట విరుద్ధమని తీర ప్రాంత పరిరక్షణ సమితి కన్వీనర్ తిరుమాని శ్రీను, సభ్యుడు తిరుమాని సత్యనారాయణ అన్నారు. మొగల్తూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిఆర్‌జెడ్ పరిధిలో ఏ విధమైన నిర్మాణాలు చేపట్టొద్దని గతంలో హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. వాటిని ఉల్లంఘిస్తూ మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మరోసారి హైకోర్టుకు ఫిర్యాదు చేయనున్నామని వారు తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి - గణపవరం

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు వైద్యులను ఆదేశించారు. శుక్రవారం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కూటమి ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తున్నట్లు చెప్పారు. ఉంగుటూరు నియోజకవర్గంలో వైద్య విభాగం అభివృద్ధికి తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నానని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యులు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రోగులకు వైద్య సేవలందించాలని చెప్పారు. ఆసుపత్రిలో సేవల స్థాయి, సిబ్బంది హాజరు, మందులు, వైద్య పరికరాలు, భవనం స్థితి గతులు, వసతులను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. అనంతరం సెమీ క్రిస్మస్ సందర్భంగా వైద్యులు, రోగులు కూటమి నాయకులతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదివ్య, ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి, తహశీల్దార్ వైకెవి.అప్పారావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎంఎల్‌ఎ

గ్రామాల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం పిప్పర పాత పంచాయతీ వద్ద జరిగిన ప్రజావాణిలో పాల్గొని మాట్లాడారు. ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుని వారి నుంచి వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పింఛన్లు, హౌసింగ్ లోన్లు, ఇళ్ల స్థలాలు, రైస్ కార్డులు, రెవెన్యూ సమస్యలపై వినతులను వచ్చాయి. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

వాట్సాప్ ద్వారా ప్రజలకు సేవలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వాట్సప్ గవర్నమెంట్ ద్వారా ప్రజలకు సంపూర్ణ సేవలు అందించే దిశగా పని ఇచ్చి ప్రభుత్వం పని చేస్తోందని ఎంపిడిఒ వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని పడాలలో వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకే పాలన అనే విధంగా వాట్సప్‌లో సమస్య చెబితే వెంటనే పరిష్కారం జరుగుతుందని తెలిపారు. అనంతరం తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.శ్రీనివాస్, విఆర్‌ఒ విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ఆచంట: ఆచంట నియోజకవర్గంలో దారిద్ర్య రేఖకు దిగువనున్న పేదలకు సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 31 మంది బాధితులకు ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ సిఎం సహాయ నిధి రూ.27 లక్షల చెక్కులను కొమ్ముచిక్కాల ఆఫీసు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి మండల, గ్రామ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - పెనుమంట్ర

జగన్‌ను కలిసిన సుధీర్‌రెడ్డి

వైసిపి పెనుమంట్ర గ్రామ అధ్యక్షులు తేతలి సుధీర్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లి ఆయన నివాసంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సారధ్యంలో కలిశారు. ఈ సందర్భంగా తనతో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గంలో వైసిపి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారని తెలిపారు. రానున్న కాలంలో అధికారమే ధ్యేయంగా పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. బేదాభిప్రాయాలు విడనాడి ప్రతి కార్యకర్తనూ కలుపుకొని వైసిపి విజయానికి బాటలు వేయాలని కోరారని తెలిపారు. ఇందుకోసం ప్రణాళికలు ఇప్పటినుండే వేసుకుని పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు.

'వెనుకబడిన వారి పరిస్థితి దయనీయం'

ఆచంట : స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు అయినా వెనుకబడిన కులాల పరిస్థితి ఇంకా దయనీయంగానే ఉందని బిసి చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆచంట రామేశ్వర స్వామి కళ్యాణ మండపంలో ఆచంట మండల బిసి ముఖ్య నాయకుల సమీక్షా సమావేశం నిర్వహించారు. వీరవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో జనాభా ధామాషా ప్రకారం 52 శాతం రిజర్వేషన్ సాధనకై బిసి చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఈతకోట సెంటర్లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ భారీ బహిరంగ సభకు మండలం నుంచి సుమారు 5000 మందిని తరలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జనగణనలో సమగ్ర కుల గణన చేయాలన్నారు. అనంతరం ఆచంట మండల బిసి చైతన్య వేదిక నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కేతా వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా అయిశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శిగా వేమన అప్పారావు, పాల కుమార్, గుడాల శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అరట కట్ల త్యాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు సానబోయిన ఏడుకొండలు, నియోజకవర్గ అధ్యక్షులు వేంద్ర రాము, జాతీయ జిల్లా కార్యదర్శి బొక్క శ్రీను, జిల్లా అధ్యక్షులు గుబ్బల నాగరాజు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి బ్రహ్మయ్య మృతి

నరసాపురం: నరసాపురం మండలం ఎల్‌బి.చర్ల ఉమ్మడి పంచాయతీ మాజీ సర్పంచి గ్రంధి బ్రహ్మయ్య (94) శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. శృంగవృక్షం గ్రామంలో కుమారుడి ఇంట మృతి చెందారు. ఎల్బీచర్ల, చామకూరిపాలెం, పసలదీవి పంచాయతీలుగా విడిపోక ముందు ఏడు సార్లు ఉమ్మడి ఎల్‌బి.చర్ల పంచాయతీకి సుమారు 25 సంవత్సరాలు సర్పంచిగా సేవలందించారు. 1985 వరకూ ఆయా గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేశారు. బ్రహ్మయ్య పదవీకాలంలో గ్రామాల్లో రహదారులు, మంచినీరు, విద్య, వైద్యం అభివృద్ధికి కృషి చేశారు. ఆయనకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బ్రహ్మయ్య మృతిపట్ల ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, తణుకు, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎలు రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ మంత్రి కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు సంతాపం వ్యక్తం చేశారు. శనివారవ భీమవరంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

జూన్ నాటికి టిడ్కో ఇళ్లు ఇస్తాం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జిల్లా వ్యాప్తంగా జూన్ నాటికి టిడ్కో గృహాలు అందజేస్తామని టిడ్కో ఎండి సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తాడేపల్లిగూడెం ఎల్.అగ్రహారం వద్ద టిడ్కో గృహాలను ఆయన శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 5,376 గృహాలకు గాను 4,208 గృహాలకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి, మిగతా 1164 గృహాలు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. పెండింగ్ ఉన్న వాటికి ఈ నెలాఖరులోపు రిజిస్ట్రేషన్ కంప్లీట్ చేయాలని, పెయింటింగ్ వర్క్ కంప్లీట్ చేయాలని కమిషనర్‌కు ఆదేశించారు. అనంతరం అక్కడ నివసిస్తున్న ప్రజలతో మాట్లాడి అక్కడ సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మెప్మా పీడీ హెబ్సిబా పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

పాలకొల్లు: ఈ నెల 21న ఆదివారం నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కోరుతూ పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం శుక్రవారం జరిగింది. 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని మున్సిపల్ కమిషనర్ బి.విజయ సారధి కోరారు. 21న పోలియో కేంద్ర వద్ద మొదటి రోజు పోలియో చుక్కలు 95 శాతం వరకూ వేసేలా చూడాలని సిబ్బందికి సూచించారు. రెండో రోజు ఇంటింటికీ వెళ్లి ఎక్కడైనా పిల్లలు మిగిలి ఉంటే వారికి పోలియో చుక్కలు వేయాలని కోరారు. డాక్టర్ డి.దేవసుధ, స్పెషల్ ఆఫీసర్ ఎంఎస్ ప్రసాద్, డాక్టర్ పి.నరేష్ కుమార్, బంగారు వారి చెరువు గట్టు మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సుదీర్ఘకాల సమస్యకు పరిష్కారం

ప్రారంభమైన ఫ్లయ్ ఓవర్ సర్వీసు రోడ్డు పనులు

తణుకు: తణుకు పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై ఉండ్రాజవరం ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా సర్వీస్ రోడ్లు సుదీర్ఘకాల సమస్య పరిష్కారం దిశగా మరో అడుగు ముందకు పడింది. ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ చేసిన అనేక ప్రయత్నాలు, కాంట్రాక్టర్లతో సమావేశాలతోపాటు అధికారులతో నిరంతర చర్చల ఫలితంగా శుక్రవారం సర్వీస్ రోడ్డు పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. గత అసెంబ్లీ సమావేశాల్లో సమస్యను ప్రస్తావిస్తూ చేసిన కషి ఫలితంగా ఎన్‌హెచ్‌ఎఐ పాత కాంట్రాక్టర్‌ను మార్చి కొత్త కాంట్రాక్టర్‌ను నియమించడం తద్వారా పనులు వేగంగా ప్రారంభమయ్యాయి. ఈ పురోగతికి సహకరించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆర్‌అండ్‌బి మంత్రి జనార్ధన్ రెడ్డి, ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు రాధాకష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం నుంచి అధికారికంగా రోడ్డు నిర్మాణం ప్రారంభంకావడంతో స్థానికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

రాయితీపై పశువుల దాణా అందజేత

ఇరగవరం: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న దాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. పది టన్నుల మిశ్రమ దాణా మండలానికి సరఫరా కాగా 120 మంది రైతులకు పంపిణీ చేశారు. దాణా 50 కిలోల ధర 1110 రూపాయలు కాగా 50 శాతం రాయితీపై రూ.555లకే అందిస్తున్నారు. మండలానికి మరో 50 టన్నుల దాణా సరఫరా అవుతుందని, అవసరమైన రైతులు తమను సంప్రదించాలని తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు వెంద్ర నాగ రాజేశ్వరరావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారుల దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

జాతీయ వినియోగదారుల దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో శుక్రవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సంబరాలు ఏర్పాట్లపై ఆయన జిల్లా పౌర సరఫరాలు, విద్య, వైద్యం, రవాణా, పరిశ్రమలు, తూనికలు కొలతలు, ఆహార భద్రత సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ నెల 18వ తేదీ నుండి 24వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో వినియోగదారుల హక్కులపై విస్తృత అవగాహన కల్పించేలా వారోత్సవాలు నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్ధ, సత్వర పరిష్కారం అనే నినాదంపై పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల్లో అవగాహన కల్పించి, ఆ నినాదంపై పోటీ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యాసరచన, వక్తృత్వం పోటీలను తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌ఒ ఎన్.సరోజ, డిఇఒ ఇ.నారాయణ, సివిల్ సప్లయిస్ డిఎం జిల్లా మేనేజర్ ఎమ్‌డి.ఇబ్రహీం, ఎఎస్‌ఒ ఎం.రవిశంకర్, వివిధ విద్యా సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక దందాపై జగన్‌కు వినతి

ప్రజాశక్తి - ఆచంట


జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుంకర సీతారాం

మండలంలో జరుగుతున్న అక్రమ ఇసుక దందాపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఫిర్యాదు చేసినట్లు వైసిపి సీనియర్ నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు తెలిపారు. తాడేపల్లిలో జగన్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సుంకర సీతారామ్, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సిఆర్‌జెడ్ పరిధిలో ఉన్న ఆచంట నియోజకవర్గంలో ఏ విధమైన అనుమతి లేకుండా కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సిద్ధాంతం, నడిపూడి, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం ర్యాంపుల్లో అక్రమంగా ఆయా గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు కనుసన్నల్లో సుమారు రూ.15 కోట్ల విలువైన ఇసుకను తరలించుకుపోయారని జగన్‌కు వివరించారు. దీనిపై మైనింగ్, విజిలెన్స్, అధికారులకు, కలెక్టర్‌కు, చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేయడంతో తట్టుకోలేని టిడిపి నాయకులు ఆయా గ్రామాల్లో సర్పంచులపై విచారణ పేరుతో అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు జగన్‌కు తెలిపారు. సర్పంచులను అక్రమ విచారణ పేరుతో ఇబ్బంది పెడుతున్న ఎఒ శ్రీనివాస్‌రావుపై టిడిపి నాయకులు గణపతి నీడి రాంబాబు, మాజీ సర్పంచి చిలుకూరి శ్రీను, బాలం వెంకటరమణపై డిజిటల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని జగన్ ఆదేశించారని తెలిపారు. ఎఒ శ్రీనివాస్‌రావుపై జాతీయ ఎస్‌సి కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు.

డాక్టర్ శేషు కుమారి ని సత్కరిస్తున్న అధ్యాపకులు

వైఎన్‌లో పిసిఒఎస్‌పై అవగాహన

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక వైఎన్ కళాశాల మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో పిసిఒఎస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర హాస్పటల్ గైనకాలజిస్ట్ ఎన్.శేషు కుమారి మాట్లాడుతూ పిసిఒఎస్ అంటే పాలిసిస్టిక్ ఓవరీ సింట్రోమ్ లక్షణాల్లో క్రమ రహిత పీరియడ్స్, అధిక బరువు పెరగడం, మొటిమలు రావడం, ముఖం, ఛాతి, వీపుపై వెంట్రుకలు పెరగడం, జుట్టు పలచబడటం వంటివి ఉంటాయన్నారు. చికిత్సలో జీవనశైలి మార్పులు చేసుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి ఇతర వైద్య చికిత్సలు ఉంటాయన్నారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, ఐక్యూఎసి సమన్వయకర్త ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ ప్రొఫెసర్ చినమిల్లి శ్రీనివాస్, కరోనా రెమెడీస్ లిమిటెడ్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

నరసాపురంలో గ్రీవెన్స్

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు విని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ పెరుగుతున్న ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటిని తక్షణం పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం లక్ష్యంగా ఈ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గం వచ్చిన ప్రజలు నుండి 1010 వినతులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి, సంకు భాస్కర్ నాయుడు, కౌన్సిలర్ పాలూరి బాబ్జి, అధికారి అనంత రామారావు, కొప్పాడ రవి తదితరులు పాల్గొన్నారు.

మన డబ్బులు మన లెక్కలు తెలుసుకోవాలి

ప్రజాశక్తి - కాళ్ల

మన డబ్బులు మన లెక్కల గురించి పొదుపు సంఘంలో ప్రతి ఒక సభ్యురాలు తెలుసుకోవాలని మాజీ ఎంపిపి ఆరేటి వెంకట రత్న ప్రసాద్, ఎపిఎం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం దొడ్డనపూడిలో మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులు అవగాహనా ర్యాలీ చేశారు. గ్రామ పెద్దలు, సీసీల సంఘ సభ్యులుపాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నరసాపురం: పేదలకు గత 18 ఏళ్లుగా సేవలందిస్తున్న ఎస్‌ఆర్‌ఎ నూర్ మహ్మద్ సేవలు అభినందనీయమని ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ అన్నారు. శుక్రవారం 19వ వార్డులో యూనిసబేగం, కమర్ ఆధ్వర్యంలో 40 మంది పేదలకు దుప్పట్లు, బియ్యం, కూరగాయలు వారితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ప్రతి నెలలో మూడు సార్లు పేదలకు సేవలు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఛైర్మన్ శ్రీమన్నారాయణ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లాటి శ్రీనివాస్, దేశియ్య, నాగేశ్వరరావు, తాతాజీ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం జూనియర్ కాలేజీ ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ప్రిన్సిపల్ సిహెచ్.శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షత వహించారు. ఎస్‌ఐ ఎ.మణికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెట్ విల్ యూత్ సర్వీస్ సిఐఒకె ఎస్.ప్రభాకర్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి వి.వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాదేవి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాల ఆచార్యులు, జనరల్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ కోడే ప్రభాదేవి సూచించారు. విద్యా మంత్రిత్వ, మహిళ శిశుఅభివృద్ధి శాఖల ఆదేశాల మేరకు నిట్‌లోని ఉమెన్ గ్రీవెన్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ ప్రభాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ విద్య, ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. ప్రస్తుత జీవనశైలిలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. వ్యాయామం, ధ్యానం, యోగా వంటి వాటికి కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. కౌమార దశలో తీసుకోవాల్సిన ఆరోగ్య సంరక్షణ, హెచ్‌పివి టీకాల ప్రాధాన్యత, మహిళలు తమ ఆరోగ్య శ్రేయస్సుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పవర్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. సైకాలజిస్ట్ శ్రీవాణి విద్యార్థినులు మానసిక సమతుల్యతను ఎలా కాపాడుకోవాలి, భవిష్యత్తును ఉన్నతంగా ఎలా నిర్మించుకోవాలి అనే విషయాలు గురించి వివరించారు. అనంతరం ప్రభాదేవిని, శ్రీవాణిని ఘనంగా సత్కరించారు. ఉమెన్ గ్రీవెన్ సెల్ ఛైర్మన్ డాక్టర్ ప్రత్యుష, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు, విద్యా సంస్థ మెడికల్ ఆఫీసర్ ధర్మ తేజ, పలువురు మహిళా ఆచార్యులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంగా నరసాపురాన్ని ఏర్పాటు చేయాలి

టిడిపి గ్రీవెన్స్‌లో వినతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని రైతు సంఘం నాయకులు కూనపురెడ్డి రంగారావు కోరారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ ప్రజావేదికలో రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నియోజకవర్గ నాయకులు, మాజీ సర్పంచి కూనపరెడ్డి వీరవెంకట విజయ రంగారావు మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల వస్తువులు కలిగి ఉన్నాయని అన్నారు. నరసాపురం మీదుగా కోస్తా తీర జాతీయ రహదారితో పాటు చక్కటి వశిష్ట గోదావరి నది జల మార్గాలు ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లడం ద్వారా జిల్లా కేంద్రంగా ఏర్పాటుకు కృషి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సంకు భాస్కర్ నాయుడు, పట్నాల జగన్మోహన్, మల్లాడి మూర్తి, దేశెట్టి సత్యనారాయణ, ఆనంద్ ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రక్తదాత ప్రాణదాతతో సమానమని తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరిచ్చే ఈ రక్తదానం అత్యవసర సమయాల్లో ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుందని తెలిపారు. గత సంవత్సరం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అధిక రక్తదానం చేయడం ద్వారా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి క్షేత్రం మీదుగా అవార్డు అందుకుందామని, ఈ సంవత్సరం రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకోగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ శిబిరంలో వాసవీ ఇంజినీరింగ్, శశి ఇంజినీరింగ్, ఆదిత్య కాలేజీ విద్యార్థులతో సహా పట్టణ యువత సుమారు వంద మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రవి సుధాకర్, ఎంహెచ్‌ఒ ఎన్.రాజు, టిపిఒ.జగదీష్, ఎఎస్‌ఒ.సురేష్, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టానికి తగిన ప్రతిఫలం

ప్రజాశక్తి - ఉండి

గత ఎన్నికల్లో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు విజయంలో కీలకపాత్ర పోషించిన జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని కూటమి ప్రభుత్వం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పదవి ఇచ్చి గౌరవించిందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మహాదేవపట్నంలో నాగరాజుకు పలువురు కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామ కృష్ణంరాజు సూచనల మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పదవి ఇచ్చి గౌరవించిందన్నారు. ఈ మేరకు ఆయనకు టిడిపి నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

పేద విద్యార్థినులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఇటీవల ప్రమాదానికి గురై ఫిజియోథెరపీ వైద్య చికిత్స పొందుతున్న పాలకొల్లు ఛాంబర్స్ కళాశాలకు చెందిన పేద డిగ్రీ విద్యార్థిని నల్లా లీలా సాయిలక్ష్మికి 10 వేల రూపాయలు అందజేశారు. అదే కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న పోతాబత్తుల కీర్తనకు ఫీజు నిమిత్తం రూ.6 వేలు వాకర్స్ సభ్యులు సమకూర్చగా అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు వాటిని ఆయా విద్యార్థినులకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని అవాంతరాలు ఎదురైనా వాటిని అధిగమించి అమ్మాయిలు చదువులో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, జవ్వాజి కళ్యాణ్, గుడాల హరిబాబు, బాసిన సత్యనారాయణ పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన ఛైర్‌పర్సన్ దంపతులు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఆమె భర్త, 8వ వార్డు కౌన్సిలర్ జయరాజు దంపతులు శుక్రవారం మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల నరసాపురం మున్సిపాల్టీలో చోటుచేసుకున్న పరిణామాలను వివరించారు. అధికార పార్టీ అక్రమాలను ధైర్యంగా ఎదుర్కోవాలని, పార్టీ అధినాయకత్వం పూర్తి అండగా ఉంటుందని జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చినట్లు ఛైర్‌పర్సన్ వెంకటరమణ తెలిపారు.

ఓదార్చి.. ధైర్యం చెప్పి

వికలాంగుడు శంకర్రావు కుటుంబానికి కలెక్టర్ భరోసా

రూ.15 వేలు పెన్షన్ మంజూరు చేయాలని డిఎంహెచ్ఒకు ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం

గూట్లపాడు గ్రామానికి చెందిన చెన్నా గౌరీ శంకరరావును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చూసి చలించిపోయారు. శంకరరావు కుటుంబ సభ్యుల పరిస్థితిపై ఆరా తీశారు. శంకరరావును ఓదార్చి కుటుంబానికి ధైర్యం చెప్పారు. స్థానిక కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశం మందిరం వద్ద శంకర్రావు కుటుంబ సభ్యులు బయట వేచి చూస్తుండగా కలెక్టర్ నాగరాణి వీల్ ఛైర్‌లో ఉన్న గౌరీ శంకరరావు పరిస్థితి చూసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తనకు పుట్టుకతో అంగవైకల్యం ఉందని, ప్రస్తుతం రూ.6 వేలు వికలాంగ పింఛను పొందుతున్నట్లు తెలిపారు. మంచానికి పరిమితమైన తనకు నెలవారీ పింఛను రూ. 15 వేలు మంజూరు చేయాలని కలెక్టర్ వద్ద శంకర్రావు కన్నీరు పెట్టుకున్నారు. దీంతో రూ.15 వేలు పింఛను మంజూరుకు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ గీతాబాయిని ఆదేశించారు.

ఉత్తరపాలెంలో కాలనీ సమస్యలు పట్టించుకోరా..!

ప్రజాశక్తి - వీరవాసరం

ఉత్తరపాలెంలో కాలనీలో నెలకొన్న సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదంటూ సిపిఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సిపిఎం ఉత్తరపాలెం శాఖా సమావేశం శుక్రవారం పాలా అజయ్‌ఘోష్ అధ్యక్షతన బిసి కమ్యూనిటీ హాల్లో జరిగింది. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శి కేతా జ్యోతిబసు ఉత్తరపాలెంలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించారు. కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు వంటి పలు సమస్యలు తాండవిస్తుంటే పంచాయతీ పాలకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పెదజువ్విపాలెం, ఉత్తరపాలెం గ్రామాల్లో సీసీ రోడ్లు ధ్వంసమై ప్రమాదాలకు కారణమవుతున్నా నివారించడంలో పంచాయతీ పాలకులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆర్‌ఒ ప్లాంట్, డ్రెయినేజీ ఏర్పాటు చేయాలంటూ అనేకసార్లు పంచాయతీ అధికారులకు వినతిపత్రాలు సమర్పించి నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా పట్టించుకోలేదన్నారు. సిపిఎం జిల్లా ప్రచార యాత్రలో కాలనీలో నెలకొన్న కరెంటు సమస్యను పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ సంబంధిత ఎఇతో మాట్లాడి వెంటనే పరిష్కరించారన్నారు. ఇదే విధంగా పాలకుల, అధికారుల తీరు ఉంటే రానున్న రోజుల్లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పాలా కోటేశ్వరరావు, జుత్తిగ సాంబియాంబ, జుత్తిగ శ్రీనివాస్, కిలాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

గోనె సంచుల కొరత లేదు : తహశీల్దార్

పెనుమంట్ర: ప్రస్తుతం ధాన్యం పట్టుబడికి గోనె సంచుల కొరత లేదని తహశీల్దార్ వై.రవికుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఇప్పటికే మండలంలోని 18 గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో 50 శాతానికి మించి వరి మాసూళ్లు పూర్తయ్యాయని తెలిపారు.

Name Change Notice

I, Magatam Annapurna @ Dornadula Hema @ Mamidi Annapurna, confirm that I have changed my name from Dornadula Hema to Magatam Annapurna. I reside at Door No.3D-5/2-29, Kobbarithota, Western Street, Eluru, West Godavari District. I am known as Magatam Annapurna @ Dornadula Hema @ Mamidi Annapurna, and all these names refer to me.

ఇంటి దస్తావేజు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం ఆచంట శివారు వంకతాళ్ల చెరువు గ్రామానికి చెందిన గెద్దాడ పరమేశ్వరరావు తండ్రి సత్యనారాయణ కు చెందిన దస్తావేజు నెంబర్ 107/2006. ఒరిజినల్ ఇంటి దస్తావేజు 2-12-2025 తేదీన వంకతాళ్ల చెరువు నుంచి ఆచంట జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్ పై వెళుండగా మార్గమధ్యలో పడిపోయినది. కావున ఎవరికైనా దొరికినచో పై అడ్రస్ కు సంప్రదించగలరు. సెల్ నెంబర్ 970541956.

పాస్‌పోర్టు పోయినది

శీలం లక్ష్మి పెద్దింట్లు, భర్త: నర్సింహ మూర్తి, డోర్ నెంబర్ 6-63, మంగళవారి గొప్పు, దక్షిణ పాలెం, గుమ్మలూరు, పోడూరు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి. ప్రజలకు తెలియ జేయునది ఏమనగా.. నేను ది 09-11-2022లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి నెంబర్ W5302604, పాస్‌పోర్ట్ పొందియున్నాను. ది 03-12-2025న మా ఇంటి నుంచి పోడూరు మండలంలోని గుమ్మలూరు జెరాక్స్ సెంటర్ కు నా పాస్ పోర్ట్ జెరాక్స్ తీయించుటకు, పాస్ పోర్ట్ రెన్యువల్ గురించి మాట్లాడటానికి బైక్ పై వెళుతుండగా దారిలో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడి పోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ అందజేయగలరు.

సెల్: 9676370957

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
F.D.I.A.No.2/2025
In O.S.No.50/2019

Between:
పల్లి సుధాకర్ ...పిటీషనర్/వాది
And
పిట్టా ప్రసాద్ ...రెస్పాండెంట్/ప్రతివాది
To.
రెస్పాండెంట్/ప్రతివాది :
పిట్టా ప్రసాద్, S/o.రాముడు,
డోర్‌నెం.7-12-5, 9వ వార్డు, ఇందిరా కాలనీ,
నరసాపురం-534 275, ప.గో.జిల్లా.

పైన తెల్పిన ఫైనల్ డిక్రీ పిటీషన్ నందు గౌరవ కోర్టు వారు మీకు చాలాసార్లు నోటీసు/సమన్లు పంపినప్పటికీ మీరు అందుకొనక ఉద్దేశ్యపూర్వకముగా Avoid చేయుచున్నందున ఈ పత్రికా ప్రకటన ద్వారా పైన తెలిపిన Final Decree పిటీషన్ ది.31-12-2025 తేదికి వాయిదా అయి ఉన్నది. కావున ది.31.12.2025వ తేదీన ఉదయం 10.30 గం.లకు మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీ వాదనను తెలియచేయవలెను. లేనియెడల పైన తెల్పిన గౌరవ కోర్టు వారు మీకు పరోక్షముగా ఆర్డరు జారీ చేయునని తెలియజేయడమైనది.
కోర్టు వారి అనుమతితో

నల్లిమెల్లి జోసఫ్, అడ్వకేట్,
నరసాపురం నరసాపురం, ప.గో.జిల్లా.
తేది.12-12-2025 సెల్: 9177774828

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి
(సీనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No.5/2022

Between:
పట్టపు నాగమణి & Another ...వాది
And
వెలగల నాగేంద్ర శ్రీనివాస్‌రెడ్డి & 12 Others ...ప్రతివాది
To.
5వ ప్రతివాది: కొల్లాటి సావిత్రి, W/o.పెద్దిరాజు,
డోర్‌నెం.23-103/1, పెదపల్లవపాలెం,
మొగల్తూరు, మొగల్తూరు మండలం.
6వ ప్రతివాది: మైలా లక్ష్మి, W/o.మైలా రాజు,
డోర్‌నెం.23-433/1, పెదపల్లవపాలెం,
మొగల్తూరు, మొగల్తూరు మండలం.
9వ ప్రతివాది: గోడి మరియమ్మ,
W/o.ఏడుకొండలు, డోర్‌నెం.11-124/2,
పుచ్చకాయల వారిపేట, మొగల్తూరు,
మొగల్తూరు మండలం.
12వ ప్రతివాది: తేలి రాజేష్, S/o.సామ్యేలు,
డోర్‌నెం.21-72, పుచ్చకాయల వారిపేట,
మొగల్తూరు, మొగల్తూరు మండలం.

పైన తెల్పిన దావా పెండింగ్‌లో ఉండగా పైన తెల్పిన మీరు అనగా 5,6,9,12 ప్రతివాదులు దావా షెడ్యూలు ఆస్థిలో కొంత భాగాన్ని కొనుగోలు చేసినందున మిమ్ములను పై నెంబరు దావాలో పార్టీలుగా చేర్చియున్నారు. గౌరవ కోర్టు వారు మీకు చాలాసార్లు సమన్లు పంపినప్పటికి మీరు అందుకొనక ఉద్దేశ్య పూర్వకముగా Avoid చేయుచున్నందున ఈ పత్రికా ప్రకటన ద్వారా పైన తెలిపిన దావా ది.22.12.2025 తేదికి వాయిదా అయి ఉన్నది. కావున ది.22.12.2025వ తేదీన ఉదయం 10.30 గం.లకు పైన తెల్పిన కోర్టులో మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరయ్యి మీ వాదనను తెలియచేయవలెను. లేని యెడల పైన తెల్పిన గౌరవ కోర్టు వారు మీకు పరోక్షముగా ఆర్డరు జారీ చేయునని తెలియజేయడమైనది.
కోర్టు వారి అనుమతితో

నల్లిమెల్లి జోసఫ్, అడ్వకేట్,
నరసాపురం నరసాపురం, ప.గో.జిల్లా.
తేది.11-12-2025 సెల్: 9177774828